
'చంద్రశేఖర్ రోగం మీ డాక్టర్లకు అంతుపట్టదు. ఆ రోగాన్ని నయం చేసే మందు ఏ డాక్టర్ దగ్గరా లేదు' గంభీరంగా అన్నాడు చెంచయ్య.

విస్మయంగా చూశాను చెంచయ్యవైపు.

నేను చంద్రశేఖర్ పరిశోధనల నిమిత్తం కాశీపురం వెళ్లాం. పరిశోధనకని వెళ్లిన చంద్రశేఖర్ ఓరోజు చీకటిపడ్డా తిరిగి రాలేదు. చుట్టూదట్టమైన అడవి, క్రూరమృగాలు ఉండటంతో కంగారు పడ్డాం. రాత్రంతా వెతికాం.

తెల్లవారి, ఓ కొండ క్రింద పడి కనిపించాడు చంద్రశేఖర్. అపస్మారక స్థితిలో ఉన్నాడు. కానీ శరీరంపై ఎలాంటి గాయాలు లేవు. రాత్రంతా అలా పడి ఉన్నా ఏ క్రూర జంతువు ఏమీ చేయకపోవటం అదృష్టం. వెంటనే చంద్రశేఖర్ని ఆస్పత్రికి తరలించాం. డాక్టర్లు బోలెడు పరీక్షలు చేశారు. అంత ఎత్తునుంచి పడ్డా ఎలాంటి గాయాలు తగలకపోవటం అదృష్టం అన్నాడు డాక్టర్. కనీసం చర్మం కూడా చీరుకుపోక పోవటం ఆశ్చర్యం అన్నాడు.



# ప్రతీకారం

## కస్తూరి మురళీకృష్ణ

అన్నిటికన్నా ఆశ్చర్యం ఏమిటంటే, ఎలాంటిగాయాలు, ఫ్రాక్చర్లు లేకున్నా చంద్రశేఖర్ కాళ్లు కదప లేకపోవటం. డాక్టర్లకూ అంతపట్టడం లేదు. ఇప్పుడు చెంచయ్య, డాక్టర్లకు అది తెలియదంటున్నాడు. నాకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు.

'ఎందుకని, డాక్టర్లు ఆ రోగాన్ని నయం చేయలేరు? డాక్టర్లు నయం చేయలేని ఆ రోగం గురించి నీకు తెలుసా?' కాస్త విసుగు, కాస్త వ్యంగ్యం కలగలసి ధ్వనించింది నా స్వరం.

'తెలుసు' అన్నాడు చెంచయ్య.

పెద్దగా నవ్వాను. 'అయితే చెప్పు. ఆ రోగమేమిటో, దానికి మందేమిటో?'

'చంద్రశేఖర్పై ప్రయోగం జరిగింది' గంభీరంగా అన్నాడు చెంచయ్య.

నవ్వు ఆపుకోలేక పోయాను. కళ్ల నీళ్లు వచ్చేవరకూ నవ్వాను.

'ప్రయోగమా? ఏం ప్రయోగం? చంద్రశేఖరేమన్నా గినియా పిగ్గా? అయినా ఎవరుచేశారు. చంద్రశేఖర్పై ప్రయోగం? దేవతలా? రాక్షసులా? ఏం ప్రయోగం చేశారు?'

చాలాసేపు చెంచయ్య మాట్లాడలేదు. చివరికి నిట్టూర్చి నోరు విప్పాడు.

'మీరు నమ్మరు. మీరు చూసిందే నమ్ముతామంటారు. కానీ మన ఇంద్రియాల శక్తి తక్కువని, వాటి పరిధి బాహిరమైన విషయాలనేకం ఉన్నాయనీ అంటే నమ్మరు' అన్నాడు.

'ఉపోద్ఘాతం వద్దు. అసలు విసయం చెప్పు' అన్నాను.

'చంద్రశేఖర్కి చేతబడి చేశారు' క్లుప్తంగా చెప్పాడు.

ఏమనాలో తోచలేదు నాకు.

'నేను చేతబడి. పీతబడులను నమ్మను. విషయం ఏమిటో తిన్నగా చెప్పు' అన్నాను కోపంగా.

'మీ చంద్రశేఖర్ మా పల్లె అమ్మాయి పరి వెంట పడ్డాడు'.

ఆశ్చర్యపోయాను. 'నాకీ విషయం తెలియదు' అసలీ యవకులతో ఎక్కడికీ పోకూడదు.

'వీళ్లకి అమ్మాయిని చూస్తే ప్రేమించేయటం తెలుసు. ప్రేమంటే ఏమిటో తెలియదు' విసుక్కున్నాను మనసులో.

'ఆ అమ్మాయి కూడా చంద్రశేఖర్ని ప్రేమించింది'

'ఇంకేం. పెళ్లి చేసేద్దాం. దానికీ చంద్రశేఖర్



# హారర్ స్టోరీ

రోగానికీ ఏమిటి సంబంధం?' కాస్సేపు మౌనంగా ఉన్నాడు చెంచయ్య. చివరికి అయిష్టంగా, ఏదో కఠినమైన విషయాన్ని చెప్తున్నట్టు చెప్పాడు.

'పరికి తల్లి తండ్రి లేరు. నానమ్మ దగ్గర పెరిగింది. ఆ నానమ్మ అంటే మా ఊర్లో అందరికీ భయం. ఆమెకు మేమెవరమూ కోపం రానీయము. ఆమె ఊరికి దూరంగా ఉంటుంది. ఊళ్లోకి రాదు'.

'ఎందుకని?'

'ఆమెకు మాయమంత్రాలు వచ్చు. ఆమెకి కోపం వచ్చిందంటే మంత్రాలు ప్రయోగిస్తుంది.

పెద్దగా నవ్వాను. 'మూర్ఖత్వం. మూఢ నమ్మకం' అన్నాను.

'ఆమెని చంపాలని మా ఊళ్లో వాళ్లు ఎన్నో ప్రయత్నాలు చేశారు'.

'మరి?'

'ప్రయత్నించిన వారు పనికి రాకుండా పోయారు'.

'యాధృచ్చికం' అన్నాను.

'మొన్న ఆమె చంద్రశేఖర్‌ని బెదిరించటం విన్నాను'.

నాకేమనాలో తోచలేదు. 'ఎప్పుడు?' అడిగాను.

'మొన్న ఒకరోజు చంద్రశేఖర్ పరితో తిరుగుతూంటే నానమ్మకంట బడింది. తన మనమరాలి జోలికి రావద్దని బెదిరించింది. చంద్రశేఖర్ వినలేదు. పైగా మంత్రాలకు చింతకాయలు రాలవని హేళనచేశాడు. పరిని తీసుకుని పారిపోతానన్నాడు. 'ఎలాపోతావు. కాళ్లు పనిచేస్తే కదా?' అని అందామె. ఆ సాయంత్రం ఈ సంఘటన జరిగింది.' చెప్పాల్సింది అయిపోయినట్టు మౌనంగా ఉండిపోయాడు చెంచయ్య.

'నువ్వివన్నీ నమ్ముతావా?' అడిగాను.

తల ఊపాడు చెంచయ్య. 'అడవిలో ఒంటరిగా ఉన్న పులులు, పాములు ఆమెనేమీ చేయవు' అన్నాడు.

'ట్రాష్. పద. ముందు చంద్రశేఖర్‌తో మాట్లాడదాం' అన్నాను లేస్తూ.

***

'నిజమే'. తలఊపాడు చంద్రశేఖర్

'నువ్వింత పిరికివాడివనుకోలేదు. మంత్రాలు లేవు మాయలు లేవు. మనిషికి మనసుంది. మెదడుంది. ఇతడొక మాట అంటాడు. ఆ మాట మనసులో నాటుకుంటుంది. ఎదిగి వృక్షమౌతుంది. దెబ్బతీస్తుంది. ఇక్కడ మాటదికాదు గొప్పదనం. ఆ మాటని నిజమని నమ్మి లేని బాధలను కొని తెచ్చుకునే మనసుది లోపం'. తల వంచుకున్నాడు చంద్రశేఖర్.

'నీ మనసులో బలహీనతలు, భయాలు ఉన్నాయి. పైకి ఏమీలేవు. దాన్ని నమ్మను. దీన్ని నమ్మను అన్నా ఆమె అలా అనేసరికి నీ భయాలు శక్తి పుంజుకున్నాయి. ఇంతకీ ఈ పరి అనే అమ్మాయిని పెళ్లి చేసుకుంటావా?' సూటిగా అడిగాను. 'పెళ్లి చేసుకోవాలని ఉంది. కానీ...' తన వాళ్ళ వైపు చూసుకున్నాడు.

'అదంతా నా కొదిలెయ్' అని లేచాను. నాతో పాటు చెంచయ్య కూడా లేచాడు.

***

'నిజమే. మేము ప్రేమించుకున్నాం. కానీ మా నాయనమ్మకు ఇష్టం లేదు. ఆమె చాలా ప్రమాదకరమైన వ్యక్తి' తల వంచుకుని లోగొంతుకలో చెప్పింది పరి.

పరి మంచి విద్యావంతురాలిలాగా, సంస్కారం కల అమ్మాయిలా కనిపిస్తోంది.

'నువ్వు చంద్రశేఖర్‌ని ప్రేమిస్తున్నావు. మీ నాయనమ్మ నుంచి అతడిని రక్షించలేవా? అయినా, చదువుకున్న దానిలా ఉన్నావు. ఇంకా ఈ చేతబడులను నమ్ముతావా?' అడిగాను.

తల ఊపింది. 'చదువుకూ నమ్మకానికీ సంబంధం లేదు'.

'అదేమిటి?'

'నేను నాయనమ్మ దగ్గర పెరిగాను. ఆమె పనులన్నీ నాకు తెలుసు. నేను చదివి, ఆమెకు దూరం పారిపోవాలనుకున్నాను. కానీ ఆమె శక్తి వల్ల నేను గ్రామం దాటిపోలేక పోతున్నాను' చివరి మాటలంటూంటే ఆమె గొంతు గద్గదికమయింది.

'నన్ను మీ ఇంటికి తీసుకువెళ్లు. మీ నాయనమ్మని చూడాలని ఉంది' అన్నాను.

'ఆమె పొరుగూరు వెళ్లింది. రేపటికి కానీ రాదు' అంది పరి.

'అయితే మరీ మంచిది. సింహం లేనప్పుడే దాని గుహను చెల్లా చెదురు చేయాలి. పద మీ ఇల్లు చూపియ్యి. చేతబడి పని పడతాను' అంటూ లేచాను.

'వొద్దు. నాయనమ్మ మంచిది కాదు. ఆమె ప్రతీకారం చాలా చెడ్డది' కంగారుగా అంది పరి.

'నేనూ మంచివాడిని కాను. నీకు చంద్రశేఖర్‌తో జీవితం గడపాలని ఉందా?'

తల ఊపింది.

'అయితే మాట్లాడకుండా నాతో రా' అన్నాను.

***

దట్టమైన అరణ్యం నడుమ కొండమాటున ఉంది గుడిసె. క్రూర జంతువులు ఆమెని ఎందుకని ఏమీచేయలేక పోతున్నాయో అర్థమ యింది. జంతువులు ఆ ఇంటి దరిదాపులకు కూడా రాలేవు.

గుడిసె తలుపులు తీసింది పరి.

లోపలంతా చీకటిగా ఉంది. కానీ శుభ్రంగా ఉంది. చెంచయ్య బయటే నిలబడ్డాడు.

గది అంతా కలియతిరిగాను. ఎలాంటి అనుమానించగలిగే వస్తువు లేదు.

'ఏవీ చేతబడి సామాన్లు?' అడిగాను.

పరి తలవంచుకుంది.

'వొద్దు సార్. నాయనమ్మ కోపం ప్రమాదకరం' అంది. ఆమె గొంతులో వణుకు స్పష్టంగా తెలుస్తోంది

'చూడమ్మా... మంత్రమైనా... తంత్రమైనా నమ్మేవాడిపైనే ప్రభావం చూపిస్తాయి. నాకెలాంటి భయాలు లేవు. ఎక్కడ మీ నానమ్మ ప్రయోగ శాల' అనడిగాను. ఆమె వేలితో చూపించింది.



## మీరే డిటెక్టివ్!?

**నిర్వహణ: అన్య**

### పాద ముద్రలు

వేటగాడు హత్యకు గురైన చోటునుండి అర మైలు దూరంలో వుందా పాక. జంతువులను వేటాడుతూ, పక్కనే పారే కాలవలో చేపల్ని పట్టుకుంటూ కొంతకాలంగా ఓ 'అడవి' మనిషి వుంటున్నాడందులో.

సహజం గానే, వేటగాణ్ణి చంపింది అతడేనని అనుమానం వచ్చింది పోలీసులకు. అ తర్వాత, విచారణలో తెలిసిన విషయాలు.

1. రెండు రోజుల క్రితం కత్తిపోట్లకు గురై మరణించాడు వేటగాడు.

2. వేసవి తాపంతో, అక్కడి నేలంతా గట్టిపడి బీటలు వారింది.

సమస్య పరిష్కారంలో డిటెక్టివ్ సహాయం కోరారు పోలీసులు.

"ఇవాళ, మరో మంచి ఆధారం దొరికింది. హత్యాస్థలంలో హంతకుని పాదముద్ర కనిపించింది. అతని బూట్ల సైజుతో అవి సరిగ్గా సరిపోయింది. ప్లాస్టర్ ఇంప్రెషన్ కూడా తీసుకున్నాం" అన్నాడు ఇన్స్పెక్టర్ వుత్సాహంగా.

"షూ సైజు సరిపోవటంలో ఆశ్చర్యమేముంది! అలాంటివి వందలు వేలుంటాయి. కేవలం అది ఆధారంగా మీరు అతణ్ణి హంతకుడనలేరు" అన్నాడు డిటెక్టివ్.

మీరు డిటెక్టివ్‌తో అంగీకరిస్తారా?

**సమాధానం:** షూ ముద్ర హంతకునిదే అయి వుంటే, అది నేల తడిగా వున్నప్పుడు పడి వుండాలి. కాని ఎండలకు నేలబీటలు బారిన తర్వాత ముద్ర కుంచించుకు పోతుంది. అంటే 'అడవి మనిషి షూ' ముద్ర కన్నా కనీసం అంగుళ మన్నా చిన్నదిగా వుండాలి.

ఆశ్చర్యపోయాను. అంతవరకూ గమనించలేదు. నేలపై ఓ చాప పరిచి ఉంది. తీరా చూస్తే అది చాపకాదు. తలుపు. అంటే ఈమె నేలమాళిగలో ప్రయోగశాల నిర్మించుకుందన్నమాట. నవ్వుకుంటూ చాప తలుపు తెరిచాను. తొంగి చూశాను. అంతా చీకటిగా ఉంది. అగ్గిపుల్ల వెలిగించి చూశాను. మెట్లు కనిపించాయి. ఇంతలో కొవ్వొత్తి వెలిగించి తెచ్చింది పరి.

ఆ కొవ్వొత్తి వెలుతురులో జాగ్రత్తగా ఒకో మెట్టే దిగాను. నా వెనకే పరి, చెంచయ్యలు మౌనంగా వస్తున్నారు. మా అడుగుల చప్పుడు, ఊపిరి శబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

మెట్లు పూర్తవగానే ఓ పెద్ద హాలు లాగా ఉంది.

'ఇదేదో పూర్వపు రాజుల జైలు లాగా ఉంది' అనుకున్నాను. కొవ్వొత్తి వెలుతురులో ఆ గది భయంకరంగా కనిపిస్తోంది.

అటూ ఇటూ కదలుతున్న వెలుతురు వస్తువులపై పడి వాటికి లేని భయంకరాకారాన్నిస్తున్నాయి.

ఆ గదిలో రకరకాల వస్తువులున్నాయి.

ఎముకలు, పుర్రెలు, మాంసం ముద్దలు, పక్షుల ఈకలు... ఓ రకమైన దుర్గంధం గదంతా వ్యాపించింది.

కాలికి ఏదోతగిలితే చూశాను. ఒళ్లు జలదరించింది. ఎవరిదో కపాలం, నోరు తెరుచుకుని గుంట కళ్లతో కోపంగా చూస్తోంది. దాని వైపు చూడకుండా అడుగు ముందు కేశాను.

చుట్టూ చూస్తుంటే ఓ రాక్షసుడి గుహలా అనిపిస్తోంది. అంతలో నా దృష్టి ఓ ట్రంకుపెట్టెపై పడింది.

కొవ్వొత్తిని పరికి ఇచ్చి ట్రంకు పెట్టె తెరిచాను.

తెరుస్తూనే షాక్ తిన్నాను.

దాన్లో రకరకాల చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మల్లాంటి బొమ్మలున్నాయి. కానీ ఆ బొమ్మలు చూస్తుంటే, ఊళ్లో కనిపించిన అనేకులు గుర్తుకు వస్తున్నారు.

చెంచయ్య గట్టిగా నిట్టూర్చాడు.

'ఇందుకే మేమంతా భయపడతాం. మా ఊళ్లో వాళ్లందరి ప్రతి రూపాలివి' అన్నాడు.

'అయితే ఎందుకు భయం?' అడిగాను.

'ఈ బొమ్మల్లోకి ఆయా వ్యక్తులను ఆహ్వానిస్తుంది. బొమ్మకేం జరిగితే వ్యక్తికి అది జరుగుతుంది' మెల్లిగా అంది పరి.

'ట్రాష్. ఫొటోగ్రాఫ్ మనిషి కానట్టే. ఈ బొమ్మలూ మనుషులు కావు. ఇవి చూసి భయపడతారు. భయంపై నరాలపై ప్రభావం చూపుతుంది. అంతే' అంటున్న నా దృష్టి ఆ బొమ్మపై పడింది.

అది మామూలు పిల్లలు ఆటలాడుకునే బొమ్మ అని తెలుస్తూనే ఉంది. కానీ దానికి చంద్రశేఖర్ వేసుకునే దుస్తుల్లాంటి దుస్తులు తొడిగారు. దాని. కాళ్ల చుట్టూ దారం గజిబిజిగా అల్లి ఉంది. ఆ బొమ్మ నిర్జీవంగా పడి ఉన్నట్టనిపించింది. దాన్ని చేతిలోకి తీసుకున్నాను. వెంటనే పరి పెద్దగా అరిచింది. నా చేతుల్లోంచి బొమ్మను లాక్కుని, గుండెలకు హత్తుకుని ఏడవటం ఆరంభించింది.

'చంద్రా... నేను నీకు చెప్పాను. నానమ్మ మంచిదికాదని. నా మాట వినలేదు. నేనేం చేయాలి చంద్రా?'

ఆ నేల మాళిగలో ఆమెరోదన భయంకరంగా ధ్వనిస్తోంది. ప్రతిధ్వని ఆరోదన నలువైపుల నుంచీ కొన్ని వేలమంది రోదిస్తున్న భావనను కలిగిస్తోంది.

'ఏడవకు' అంటూ బొమ్మని లాక్కుని పరిశీలించాను. బొమ్మపై ఎలాంటి పిన్నులు గుచ్చిలేవు. గాయాలు లేవు. ఏ అంగమూ విరిచి లేదు. కేవలం కాళ్లు అలిబిల్లిగా దారాలతో కట్టి ఉన్నాయి.

'పదండి' అని వెనుతిరగబోతున్న నా దృష్టి, ఆ గుడ్డి వెలుతురులో గది చివరలో వేలాడుతున్న సాలె గూడు లాంటి దానిపై పడింది.

'ఏదీ కొవ్వొత్తి' అని కొవ్వొత్తి తీసుకుని ఆ సాలె గూడు లాంటి దారాల అల్లికను జాగ్రత్తగా గమనించాను.

అది చూస్తూనే పరి ముఖం పాలిపోయింది. ఏడవటం ఆరంభించింది.

ఆ సాలెగూడు లాంటి దారాల అల్లిక నడుమ బందీలా ఓ ఆడ బొమ్మ పడి ఉంది. చూస్తుంటేనే అది 'పరి' అని తెలుస్తోంది.

నాకు నవ్వొచ్చింది.

చిన్నపిల్లలు ఆటలాడుకుంటారు. పిడతల్లో ఊహ అన్నాలు వండుతారు. తింటారు. అదే నిజమని భ్రమపడి సంతృప్తి పడతారు. అలాంటి మాయ ఇక్కడా జరుగుతోంది. ఓ పంజరం అల్లి దాన్లో బొమ్మని పడేసి, ఈ బొమ్మ నువ్వు, పంజరం దాటలేవు అనగానే మనిషి అది నిజమని నమ్ముతున్నాడు. తన చుట్టూ లేని పంజరాన్ని ఊహించుకున్నాడు. బలహీన మనస్సులతో తెలివైన వాడు ఆడుకునే మాయ ఆట ఇది.

'వొద్దు' అరిచింది పరి. నా మనసులో మాట గ్రహించినట్టు.

నేను ఆమెని పట్టించుకోలేదు. 'పక్కనే ఉన్న కర్రతో ఆ దారాలను తెంపేసి బొమ్మను చేతిలోకి తీసుకున్నాను. చంద్రశేఖర్ బొమ్మ పక్కన పట్టుకున్నాను.

'మీ ఇద్దరికీ పెళ్లి' అంటూ నవ్వాను.

పరి ఏడవ సాగింది. చెంచయ్య వణికిపోతున్నాడు. నేను నవ్వు ఆపుకోలేక పోయాను.

***

'నువ్వింత బలహీన మనస్కుడివి అనుకోలేదు. నీకేం కాలేదు. నీ సమస్య అంతా నీ మెదడులో ఉంది. ఇదిగో చూడు. నీ కాళ్ల చుట్టూ నువ్వూహించుకుంటున్న మాయబంధాలను విప్పేస్తున్నాను. నీ మెదడులో ఉన్న మూఢ నమ్మకాల దారాలను విప్పెయి. లేచి నడువు' అన్నాను. బొమ్మ కాళ్లకున్న దారాలు విప్పేశాను. చంద్రశేఖర్ కదల బోయాడు. కదలలేక పోయాడు.

డాక్టర్ నవ్వాడు.

'వాళ్లని అంటూ, మీరూ మూఢ నమ్మకాలను నమ్మినట్టు ప్రవర్తిస్తున్నారు' అన్నాడు.

'మనిషికి ఆత్మవిశ్వాసం ఉంటే, ఏ మంత్రం ఏమీ చేయలేదు. బలహీన మనస్సులపై ప్రభావం చూపు తాయి. చంద్రశేఖర్ ఎంతగా పైకి నమ్మనన్నా, మన స్సులో నమ్మి ఉంటాడు. ఆ నమ్మకాన్ని వమ్ము చేశాను. నడుస్తాడు చూడండి' విశ్వాసంగా అన్నాను.

పరి ఏడుస్తూ చంద్రశేఖర్‌పై పడింది. వాళ్లిద్దరినీ చూస్తూంటే నవ్వొచ్చింది.

'సాయంత్రం కారు వస్తుంది. మీరిద్దరూ హైద రాబాద్ వెళ్లిపొండి. ఇక ఎవరూ మిమ్మల్ని ఏమీ చేయలేరు' అన్నాను.

'మరి మీరు?' అడిగింది పరి. కళ్లు తుడుచు కుంటూ.

'నా గురించి మీకు భయం అక్కర్లేదు. నేను పని పూర్తి చేసుకుని వస్తాను. నేను వచ్చేలోగా మీరు శుభవార్తతో సిద్ధంగా ఉండాలి' అన్నాను.

పరి సిగ్గు పడింది. అంతలోనే ఆమె ముఖంలో భయం స్పష్టంగా కనిపించింది.

'నానమ్మ. రేపు ఇంటికి వస్తుంది. విషయం తెలిస్తే ఆమె కోపాన్ని పట్టలేము. ఆమె మంచిది కాదు' అంది.

'ఆమె విషయం నా కొదిలేయండి. నాకేం భయం లేదు' అన్నాను.

ఇంతలో చంద్రశేఖర్ పెద్దగా అరిచాడు. ' నా కాలు కదలుతోంది'.

***

పరిశోధన చివరికి వస్తోంది.

నేను ఆదేశించినట్టే చంద్రశేఖర్, పరిలు శుభవా ర్తతో నా కోసం ఎదురు చూస్తున్నారు.

నేను ఊరికి వచ్చిన తెల్లారే, పరి నాయనమ్మని కలవాలని వెళ్ళాను. కానీ ఆమె అంతకుముందు రాత్రి ఇంటికి వచ్చిందట. జరిగినది తెలుసుకుని ఏడ్చిందట.

తన బ్రతుక్కి అర్థం లేదని ఏడుస్తూ వెళ్లిపోయిం దట.

తెల్లారేసరికి ఆమె గుడిసె మొత్తం బూడిదయి పోయింది. ఆమె ఏమైందో తెలియదు. కొందరు ఆమె గుడిసెతో పాటు కాలిపోయిందని. ఇంకొం దరు ఆమె రాత్రిళ్లు ఒంటరిగా అడవిలో తిరు గుతూ, ఏడుస్తూ అరుస్తోందని అంటారు. కొందరు ఆమె తోడేలై పోయిందంటారు. ఇంకొందరు ఆమె వదిలిపోయిన మనవరాలిని తలచుకుంటూ ఏడుస్తూ తిరుగు తోందంటారు.

అన్నీ నీలి వార్తలు. వదంతులు.

ఆమెని కలవాలన్న నా కోరిక తీరలేదు. కానీ, ఎందుకో సంతృప్తిగా అనిపించింది.

నా తిరుగు ప్రయాణానికి కారు వచ్చింది. సామాన్లన్నీ కారులో ఎక్కించాను.

ఒక్కసారి ఊరి వైపు చూశాను.

చెంచయ్యతో సహా, పలువురు వీడ్కోలు చెప్పారు. కన్నీళ్లతో.

కారు స్టార్టయింది.

కాస్సేపటికి ఊరు వదిలింది.

అడవి అందాన్ని చూస్తూ కూచున్నాను. ఆకు లపై ప్రతిఫలిస్తున్న సూర్య కాంతిని చూస్తుంటే ఆనందంగా ఉంది. అడవి పచ్చదనం అద్భుతంగా ఉంది.

'సుహానా సఫర్ ఔర్ యె మౌసమ్ హసీ' పాట పెదవుల పైకి వచ్చింది.

విజిల్ వేశాను.

శబ్దం బయటకు రాలేదు.

అసలు పెదవులు కదలటం లేదు.

'డ్రైవర్' అనాలనుకున్నాను. కానీ నాలిక గ్రానైట్ రాయిలా మారి నట్టుంది.

నా శరీరం బరువెక్కుతోంది. కాళ్లు బండరాళ్లలా అనిపిస్తున్నాయి.

చేయితో సౌంజ్ఞ చేయబోయాను.

చేతులు కదల లేదు.

నా మనస్సులో ఆ బలహీనక్షణంలో ఓ ముస లమ్మ అస్పష్ట రూపం మెదిలింది.

చెవుల్లో 'ప్రతీకారం' అని గుసగుసగా ఎవరో అన్నట్టనిపించింది. దూరంగా అడవిలో తోడేలు ఏడుస్తున్న శబ్దం వినిపించింది. దానికి వంత పాడు తున్నట్టు ఎవరో ముసలమ్మ ఏడుస్తున్న శబ్దం విని పిస్తోంది... పెద్దగా! ❑

